# పరిష్కారం దాకా పోరాటం కొనసాగిస్తాం..

- కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ హెచ్చరిక
- సత్తుపల్లిలో 11వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు
- జీతాల అప్‌గ్రేడేషన్, పీఆర్‌పీ అమలుకు డిమాండ్







**సత్తుపల్లి, జులై 9 (పీసీడబ్ల్యూ న్యూస్):** సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారం 11వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం 9:25 గంటల నుంచి అధికారులు దీక్షా శిబిరంలో కూర్చొని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా అధికారుల జీతాల అప్‌గ్రేడేషన్‌తో పాటు ఉద్యోగుల సంక్షేమానికి కీలకమైన పే రివిజన్ ను తక్షణమే అమలు చేయాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గబోమని వారు స్పష్టం చేశారు. రిలే నిరాహార దీక్షల్లో పలువురు అధికారులు పాల్గొని సంఘీభావం ప్రకటించగా, అసోసియేషన్ నాయకులు, అధికారులు అరుణ్ బాబు, వేణుబాబు, చెన్నకేశవరావు, సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై ఉద్యమానికి మద్దతు తెలిపారు.

# ప్రాణాలకు భరోసాగా 'సురక్ష హాస్పిటల్'

- ఖమ్మంలో నూతన భవనంలో ఘనంగా ప్రారంభమైన 'సురక్ష హాస్పిటల్'
- ఎండీలు డాక్టర్ రుద్ర గౌతమ్ నరేష్, డాక్టర్ తక్కళ్ళపల్లి వరుణ్ లకు తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం శుభాకాంక్షలు



**ఖమ్మం ప్రతినిధి, జూలై 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆరోగ్యమే మహాభాగ్యం.. అలాంటి ఆరోగ్యం పేదవాడికి భారమవ్వకూడదు. ఆపదలో ఉన్న ప్రాణానికి అండగా నిలవడమే నిజమైన దైవత్వం. ఖమ్మం నగరంలో నూతన భవనంలో అడుగుపెట్టిన 'సురక్ష హాస్పిటల్' ద్వారా పేద ప్రజలకు న్యాయం జరగాలని, సమాజంలో ఒక కొత్త ఆరోగ్య విప్లవానికి ఇది నాంది కావాలని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు దాసరి నరేష్, తాళ్లూరు నరసింహారావు లు ఆకాంక్షించారు. గురువారం ఖమ్మం పట్టణంలో నూతన అత్యాధునిక భవనంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ రుద్ర గౌతమ్ నరేష్, డాక్టర్ తక్కళ్ళపల్లి వరుణ్ ల ఆధ్వర్యంలో 'సురక్ష హాస్పిటల్' అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకొని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం ప్రతినిధులు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛాలు అందించి తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ మాట్లాడుతూ.. "వైద్యం అనేది కేవలం ఒక వృత్తి కాదు.. అదొక పవిత్రమైన సేవని, 'సురక్ష హాస్పిటల్' ద్వారా సమాజంలో అణగారిన, పేద వర్గాలకు నాణ్యమైన వైద్యం అందించి, వారి గుండెల్లో నమ్మకాన్ని నింపాలని, ప్రాణ రక్షణకు ఈ హాస్పిటల్ ఒక వేదిక అవ్వడమే కాకుండా, సమాజం మొత్తానికి ఒక దిక్సూచిగా, మార్గదర్శకంగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరు నరసింహారావు మాట్లాడుతూ, నూతన టెక్నాలజీతో పాటు మానవీయ విలువలను జోడించి రోగులకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యాజమాన్యంతో పాటు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నారపోగు వీరభద్రం, జిల్లా ఉపాధ్యక్షులు చాపలమడుగు నాగేశ్వరావు, జిల్లా సాంస్కృతిక అధ్యక్షులు తుప్పతి శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు శీలం బాలకృష్ణ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కాకటి కరుణాకర్, చింతకాని మండల అధ్యక్షులు బత్తుల రాజకుమార్, సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, సురక్ష హాస్పిటల్ ఉజ్వల భవిష్యత్తును ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

# కల్లూరు మున్సిపాలిటీలో తైబజార్ బహిరంగ వేలం

- జూలై 14న ఉదయం 11 గంటలకు వేలం
- ఆసక్తి గల వారు జూలై 13లోగా దరఖాస్తు చేసుకోవాలి: కమిషనర్ సాయి కృష్ణారెడ్డి



**కల్లూరు, జులై 9 (పీసీడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు పురపాలక సంఘం పరిధిలో 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వసూళ్ల హక్కుల బహిరంగ వేలాన్ని ఈ నెల 14న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పురపాలక సంఘం చట్టం2019లోని నిబంధనల మేరకు జూలై 14న ఉదయం 11 గంటలకు కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నారు. వేలంలో పాల్గొనదలచిన ఆసక్తి గల వారు నిర్ణీత నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుని హాజరు కావాలని సూచించారు. వేలం కాలపరిమితి ఆగస్టు 2026 నుంచి మార్చి 2027 వరకు 8 నెలలు ఉంటుంది అని తెలిపారు. దరఖాస్తు ఫారాలను జూలై 3 నుంచి 13వ తేదీ వరకు కార్యాలయ పనివేళల్లో రూ.5 వేలు దరఖాస్తు రుసుము చెల్లించి పొందవచ్చు. అలాగే వేలంలో పాల్గొనే వారు రూ.10 వేలు ధరావత్ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది.దరఖాస్తుల స్వీకరణకు జూలై 13 సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే గడువు ఉంటుందని, అనంతరం వచ్చే దరఖాస్తులను స్వీకరించబోమని అధికారులు స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘించిన దరఖాస్తులను రద్దు చేయడం లేదా తిరస్కరించే పూర్తి అధికారం కమిషనర్‌కు ఉంటుందని, అవసరమైతే ఎలాంటి కారణం చెప్పకుండానే బహిరంగ వేలాన్ని రద్దు చేసే అధికారం కూడా కమిషనర్‌కు ఉందని ప్రకటనలో పేర్కొన్నారు.వేలానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం కార్యాలయ పనిదినాల్లో కల్లూరు మున్సిపాలిటీ కార్యాలయంలోని సంబంధిత సిబ్బందిని సంప్రదించాలని అధికారులు సూచించారు.

# తెలంగాణ ఉద్యమ గుండెకాయ ఆర్టీసీ కార్మికులు..

- వారి కన్నీళ్లు తుడవండి సీఎం సారు!
- పదవీ విరమణ పొందినా అందని ఫలితాలు..
- 400 మంది కార్మికుల మరణం అత్యంత బాధాకరం!
- ఆర్టీసీ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, పీర్సీలు, డీఏలు వెంటనే చెల్లించాలి
- ఖమ్మం పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పాలి
- టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు



**ఖమ్మం ప్రతినిధి, జూలై 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో సకల జనుల సమ్మెతో ఆర్టీసీ చక్రాన్ని బంద్ చేసి, స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేయడంలో ఆర్టీసీ కార్మికులు తమ రక్తాన్ని, చెమటను ధారపోశారు. ఉద్యమ కాలంలో గుండెకాయలా నిలిచిన అదే ఆర్టీసీ కార్మికులు, నేడు వయసు ఉడిగి రిటైర్ అయ్యాక తమ హక్కుల కోసం, న్యాయబద్ధంగా రావాల్సిన సొమ్ము కోసం కన్నీరు మున్నీరవుతుండటం అత్యంత దురదృష్టకరమని తెలుగుదేశంపార్టీ టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఖమ్మంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2017 నుండి 2023 వరకు సుమారు 20 వేల మంది ఆర్టీసీ కార్మికులు పదవీ విరమణ పొందారని, కానీ గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల వారికి రావాల్సిన బెనిఫిట్స్ ఇంతవరకు అందలేదని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగ కాలంలో ఎంతోమంది అధికారుల ఒత్తిళ్లను తట్టుకుని, రాత్రింబవళ్లు ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిన కార్మికులకు రిటైర్మెంట్ తర్వాత తీవ్ర మనోవేదన మిగిలిందని అన్నారు. "స్వరాష్ట్రం వస్తే బతుకులు బాగుపడతాయనుకున్న కార్మికులకు శ్రమ దోపిడీయే మిగిలింది. రావాల్సిన డబ్బులు అందక, ఆర్థిక ఇబ్బందులతో దాదాపు 400 మంది కార్మికులు ఆ కష్టార్జితాన్ని కళ్లచూడకుండానే కన్నుమూశారు. చనిపోయిన కార్మికుల త్యాగాలకు, వారి కుటుంబాల ఆక్రందనలకు అప్పటి పాలకుల తప్పిదాలే కారణం. నెలకు కేవలం 2 నుండి 3 వేల రూపాయల నామమాత్రపు పెన్షన్‌తో ఈ వృద్ధాప్యంలో వారు ఎలా బతకాలి? అని టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు అన్నారు. **గత పాలకుల ద్రోహాన్ని పునరావృతం చేయకండి.. రేవంత్ రెడ్డి గారే ఆదుకోవాలి!** కేంద్ర కార్మిక శాఖ, రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు కార్మికుల శ్రమ తెలిసి కూడా ఆర్టీసీకి తీరని ద్రోహం చేశారని భాస్కరరావు విమర్శించారు. 2019 ఆర్టీసీ సమ్మె సమయంలో అప్పటి ప్రభుత్వం అనుసరించిన మొండి వైఖరి, ఉద్రేక ప్రసంగాల వల్ల మనస్తాపానికి గురై 50 మందికి పైగా కార్మికులు ప్రాణాలు కోల్పోయారని, ఆ ప్రాణ నష్టానికి బీఆర్ఎస్ పార్టీదే పూర్తి బాధ్యతని అన్నారు. 30 ఏళ్ల పాటు సంస్థ కోసం రక్తాన్ని చెమటగా మార్చిన కార్మికులకు ఇప్పటివరకు మొండిచేయే ఎదురైందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వం నేతృత్వంలోని ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. గత పాలకులు చేసిన చారిత్రక తప్పిదాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పునరావృతం చేయకుండా, మానవీయ కోణంలో ఆలోచించాలన్నారు. వృద్ధాప్యంలో ఉన్న కార్మికుల మనోవేదనను అర్థం చేసుకుని, వారికి రావాల్సిన పీఆర్సీ, డీఏలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ డబ్బులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ముఖ్యంగా సీఎం రేవంత్ రెడ్డి తన ఖమ్మం జిల్లా పర్యటన సందర్భంగా ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేలా ఒక మంచి శుభవార్తను ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో టిఎన్టియుసి నాయకులు పాలడుగు కృష్ణ ప్రసాద్, బోయిన వెంకన్న, పొదిల శ్రీను, బోడెపుడి రవి, కొండబాల అశోక్ తదితరులు పాల్గొని కార్మికుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు పలికారు.

# వ్యక్తిగతంగానే జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు

- సొసైటీలతో న్యాయపరమైన చిక్కులు
- సీఎంకు సూచిస్తానని ఉప ముఖ్యమంత్రి భట్టీ హామీ
- టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ వినతిపై స్పందన

**ఖమ్మం ప్రతినిధి, జూలై 9 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్ – హెచ్ – 2843) ఖమ్మం జిల్లా కమిటీ గురువారం ఖమ్మం జిల్లా, చింతకాని మండలం, లచ్చగూడెంలో సమర్పించిన వినతిపత్రంపై డిప్యూటీ సీఎం స్పందించారు. మండలంలోని జగన్నాథపురంలో శుక్రవారం జరిగే రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి హాజరవుతున్న దృష్ట్యా జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్లాల్సిందిగా టీడబ్ల్యూజేఎఫ్ నేతలు కోరారు. దీనిపై స్పందించిన భట్టి... సొసైటీల ద్వారా అయితే న్యాయపరమైన చిక్కులు ఉంటాయి కాబట్టి, అవేవీ లేకుండా వ్యక్తిగతంగానో...బీపీఎల్ కోటాలోనో...మరో రకంగానో ఇచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జర్నలిస్టుల్లో చాలామంది పేదలు, మధ్యతరగతి వర్గానికి చెందినవారు, చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, అద్దె ఇండ్లలో ఉంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో టీడబ్ల్యూజేఎఫ్ పేర్కొంది. జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయమై అనేక పర్యాయాలు గత, ప్రస్తుత ప్రభుత్వంలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో విజ్ఞప్తులు, పోరాటాలు నిర్వహించామని ఫెడరేషన్ నేతలు తెలిపారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం వెలుగుమట్ల, వీవీ పాలెం రెవెన్యూలో 23 ఎకరాలకు పైగా కేటాయిస్తూ జీవో ఇచ్చిందని, కానీ అది కార్యరూపం దాల్చలేదని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దీనిపై కొంత సందిగ్ధత ఏర్పడిందని న్యాయపరమైన చిక్కులు లేకుండా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేసే విషయమై ఇప్పటికే ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ప్రకటనలు చేసి ఉన్నారని



ప్రస్తావించారు. సొసైటీలతో సంబంధం లేకుండా జర్నలిస్టులకు వ్యక్తిగతంగా ఇండ్ల స్థలాలు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ విషయంలో నాన్చివేత ధోరణి విడనాడాలని కోరారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని తమరి నియోజకవర్గానికి విచ్చేస్తున్న దృష్ట్యా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏ ప్రాతిపదికన, ఎప్పటి లోగా ఇండ్ల స్థలాలు ఇస్తారో...! నిర్దిష్టమైన తేదీతో సహా వెల్లడించేలా స్పష్టమైన ప్రకటన చేయించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టీబీజేఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆవుల శ్రీనివాస్, మానుకొండ రవికిరణ్, జిల్లా కమిటీ సభ్యులు రాంపుడి నాగేశ్వరరావు, కొత్త యాకేష్, మంకెన నాగేశ్వరరావు, నూకల రామచంద్రమూర్తి, కొమెర నాగేశ్వరరావు, ఖమ్మం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు తురగ రాజేంద్రమూర్తి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలుబోల మధుశ్రీ, టీబీజేఏ కెమెరామన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫయాజ్, గణేష్, అర్షద్, శరత్, నాయకులు సీహెచ్ ప్రసాద్, సురేందర్, గడ్డం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

